కథ

# రేయి వీడని నక్షత్రం

కొండవలస శ్రీనివాసరావు

"అపశ్రుతులు మీటుతున్నారు.." వీణ మీటుతున్న చిరంజీవి మాష్టార్ని అడిగాడు శేఖర్.
"తీగలు సరిగా సవరించలేదు..." తడబడుతూ ఒదిగిపోయాడు చిరంజీవి మాష్టారు.
"సరిచేసి మీటండి..." అంటూ మేడ మెట్లు దిగి క్రిందికి వెళ్ళిపోయాడు శేఖర్.
మంజరి మనసులో కోరిక బుసలు కొట్టింది. ఆమెను చూస్తున్న చిరంజీవి మాస్టారిలో ఏదో అలజడి.
"ఈ వాళ్లకీ పాఠాలు చాలు..." వణికిపోతూ మెట్లు దిగి వెళ్ళిపోయాడు చిరంజీవి మాష్టారు.



చిరంజీవి బిగి కౌగిలి అనుభూతి నుండి కొంతసేపటి వరకు తెములుకోలేక పోయింది మంజరి. మంజరిలో రానురాను పెరుగుతున్న ఉద్రేకం, తాపం ఆమెను వివశురాలిని చేస్తోంది. ఆమెలోని తాపం ఉద్రేకరూపం దాలుస్తోంది. ఆమెనలా బాధించడమే శేఖర్ కోరిక. మంజరి అలా అశాంతితో బాధపడుతూనే ఉంటే ఆమెకు పిచ్చిపట్టిందని లోకానికి చెప్పవచ్చు. అలానే ఆమె కృశించి నశిస్తే మంజరి కోట్ల ఆస్తికి తాను వారసుడు కాగలననే దురాశ శేఖరానికి ఉంది.

తల్లిదండ్రులు చనిపోవడంతో మంజరి అనాథ అయింది.

''మనది రాజవంశం. వంశ గౌరవానికి వ్యతిరేకంగా మన ఇంటి ఆడపడుచులు వీధిలోకి పోకూ డదు..'' అంటూ మంజరిని బంగారు పంజరం వంటి భవనంలో బంధించి తన మనుషులను కాపలా పెట్టాడు శేఖరం.

ప్రపంచమంతా అత్యాధునిక నాగరికత అలముకున్నా ఇంకా ఈ రాజుల మూఢ నమ్మకాల సంకెళ్లు వదలని బానిస బతుకులోనే మగ్గుతోంది మంజరి. కోట్ల ఆస్తికి వారసురాలైన మంజరి మాటవిన్నట్లే నటిస్తూ ఆమె చేత సంతకాలు, పనులు మంచిగా చేయించుకుంటూ ఉన్నాడు శేఖరం. అప్పటికే లోకం దృష్టిలో మంజరి మతిచలించిన అమ్మాయి. ఆమెనలానే ఉంచాలి అంటాడు శేఖరం. ఇలా మంజరి స్వేచ్ఛకు సంకెళ్లు వేసి పంజరంలోని పక్షిని చేశాడు.

కాలం గడిచేకొద్దీ మంజరిలో ఏవో కోరికలు, మనస్తాపం రేగడం ప్రారంభించింది. వీణ నేర్పించ వచ్చే చిరంజీవి మాష్టారిని చూస్తే చాలు మంజరి వివశురాలు అవుతోంది. ఆమెలో నిద్రాణమై ఉన్న కోరికలు బుసలు కొడుతుంటాయి. మంజరిని చూస్తున్నప్పుడు చిరంజీవిమాస్టారి కళ్లలో కోరికలు బుసలు కొడుతుంటాయి. ఎవరూ లేని ఏకాంతంలో ఓసారి చిరంజీవి మాష్టారు బిగి కౌగిలిలో బంధించాడు. అప్పుడు తెలిసింది మంజరికి శరీరానికి మరోశరీరం తాకితే ఆ అనుభూతే వేరని. అప్పటి నుండే తనలో నిద్రాణమై ఉన్న కోరికలను అదుపు చేయలేక పోతోంది.

***

సమయం అర్ధరాత్రి దాటింది. నిద్ర పట్టక పక్కపై నుండి లేచి టెర్రస్ మీదకు వెళ్లింది మంజరి.

చిరాగ్గా అటూ ఇటూ తిరుగుతున్న మంజరికి తానున్న భవనానికి కొద్దిదూరంలో చీకటిలో చిరు మంట కనిపించింది. ఆ మంట ముందు ఓవ్యక్తి కూర్చుని చలికాచుకుంటున్నాడు. కండలు తిరిగిన అతని శరీరం చ వ ుటలు పట్టి మెరుస్తూంది. అతడిని చూడగానే మంజరి మనసులో తీయని మంటలు రేగాయి. అతని బిగికౌగిలి లో కరిగిపోవాలనిపించింది.. ఎలా? చప్పుడైతే కాపలాదారు ఒక పక్క.., కుక్క మరో పక్క. తను అభాసుపాలు అవుతుంది. గదిలోకి పోయి ఫ్రిజ్‌లోని ఐస్ ముక్కలు కొన్ని ట్రేలో వేసుకొని తెచ్చింది. ఓ ఐస్ ముక్క బలంగా మంట ముందు కూర్చున్న వ్యక్తి మీదకు విసిరింది. సరిగ్గా గుండె గుభిల్లిన తగిలిన ఐస్‌ముక్క దెబ్బకు తుళ్లిపడి అది వచ్చిన దిశకేసి చూశాడతను. ఎదురుగా మేడ మీద నీలిరంగు డిమ్‌లైట్ కాంతిలో దేవకన్యలా మెరిసిపోతూ కనిపించింది మంజరి.

'రాత్రులు తిరిగే కామినీ పిశాచి కాదు కదా...?' అనుకున్నాడు. తనను రమ్మనమన్నట్లు ఈసారి సైగచేసిన మంజరిని చూశాడతను. ఆశ్చర్యపోయాడు అతడు. ఈసారి కూడా తనను పిలుస్తూ చేయి ఊపింది మంజరి. తననే పిలుస్తూందని నిర్ధారించుకున్న అతను ఆమె వద్దకు వెళ్లడమా... మానడమా... అనే సందిగ్ధంలో పడ్డాడు. తనెవరో తెలిసీ పోలీసులకు అప్పగించదు కదా... ఒకింత ఆలోచనలో పడ్డాడు. కవ్వింపుగా ఒళ్లువిరుస్తూ తనను చూడ్డం గమనించాడతడు. చూస్తుంటే గొప్పింటి అమ్మాయిలానే ఉంది. పిచ్చిదేమో ఎటూ తేల్చుకోలేక పోతున్న అతను పెట్రోలింగ్ పోలీస్ జీప్ వస్తున్న శబ్దం గమనించాడు. అతనిలో రక్తం పొంగింది. ఏమయితే అయిందని మంజరి దగ్గరకు చేరాడతను. మంజరి విలాసంగా చేయి వేసింది అతనిపై. అతనికి కోపం వచ్చి తనపై వేసిన ఆమె చేతిని విదిలించి కొట్టాడు. అతను నేరుగా అమె పడగ్గదిలోకి దూరి బెడ్‌లైటు ఆర్పేశాడు. పోలీస్ జీప్ తమ ఇంటిముందు నుండి వెళ్ళిపోయింది. గుండె గాభరా తగ్గిన అతను మంజరివైపు కృతజ్ఞతగా చూశాడు. మెలేసిన అతని మీసాలు, పెదవిపై కత్తిగాటు మచ్చ అతని క్రూరమైన రూపం మంజరిని ఒకింత చలింపచేసింది. ''దాహం... మంచి నీళ్లు కావాలి..'' అడిగాడతడు.

లైటువేసి ''ఫ్రిజ్ తెరచి పండ్లు, రొట్టె జాము, కోక్ ఏవి కావాలన్నా తీసుకో'' అని అతనికి చెప్పింది.

కోక్‌ను తీసుకొని గడగడా తాగేడు. ఆకలిగొన్న పులిలా పెద్ద ఏపిల్ పండు తినసాగాడు. బ్రెడ్ స్లైస్‌కు జామ్ రాసి ఇచ్చింది మంజరి. ఒకింత ఆశ్చర్యంగా ఆమెను చూసి ఆమె ఇచ్చిన స్లైస్ బ్రెడ్ తింటూ గదికేసి పరిశీలనగా చూశాడు. గదిలో ఓ మూలన ఉన్న సెల్ఫులో బంగారు నగలు, వజ్రాలు తాపిన నగలు చూశాడు అతడు. అతని కళ్లు చెదిరాయి. సెల్ఫు దగ్గరగా వెళ్లి గాజు అద్దాల తలుపు తెరచి అందులోంచి ఒక్కో నగ




తీసాడు. మంజరి తన చీర నొకదాన్ని చింపి అతని దగ్గర పరిచింది.

అందులో నగలు ఉంచుతూ ''నాకెందుకిలా అడు గడుగునా సహకరిస్తావ్... అసలు నేనెవరో నీకు తెలుసా? పేరుమోసిన దొంగ రంగన్నను.. నాలుగు రోజుల నాడు సెంట్రల్ జైల్ నుండి తప్పించుకొచ్చే శాను.. మొన్న ఒక మర్డరు, నిన్న రెండు దొంగతనాలు చేశాను. నన్ను పట్టుకోవటానికి పోలీసులు తిరుగుతు న్నారు. మరి నేనంటో భయంగానీ, అసహ్యంగానీ కలుగ లేదా...?'' అడిగాడతను.

అతని మాటలకు విలాసంగా మరికాస్తా నిర్ల క్ష్యంగా నవ్వింది మంజరి. తనకేవీ తెలీదన్నట్లు. తన మాటలపై నిర్లక్ష్యం. తనపై చూపుతున్న దయకు ఆమెపై అతనికి ఎనలేని అనురాగం కలుగ సాగింది. సెల్ఫులోని ఒక్కో నగ తీసి ఆమె అతని కందిస్తోంది.

''ఇలా నన్ను మచ్చిక చేసుకొనే వాళ్లను చూస్తే



నాకు కోపం వస్తుంది.'' అన్నాడు కావాలనే కోపంగా.

అతని మాటలకు చిన్నగా నవ్వి ''ఇవి కూడా తీసుకో...'' అంటూ తన చేతికున్న రవ్వల గాజులు, మెడలోని వజ్రాల లాకెట్ తీసి అతనికిచ్చింది. అప్పుడే ఆమె కళ్లలో నుండి బైటకు రాకుండా నిలు చున్న కన్నీటి బిందువులను గమనించి చలించాడతడు.

''ఎందుకలా ఉన్నావ్...?'' అడిగాడు.

''నా పేరు మంజరి... మంజూ అని పిలువు.''

తీయటి పేరు... అప్పుడే ఆమె జగదేక రూపాన్ని చూసి భ్రాంతి చెందాడు. అతనిలోని మగతనం బుసలు కొట్టింది. ఎలాగో తమాయించుకున్నాడు.

''ఇంతవరకూ నన్ను అసహ్యించుకొనే వారే గానీ నీలా అనురాగంలో ఆశ్రయమిచ్చి ఆదరించే అమ్మాయే కరవయింది. నీలాంటి గొప్పింటి అమ్మా యికి కూడా ఆదరణ, అభిమానం ఉంటుందని నిన్ను చూశాకే తెలిసింది'' అన్నాడు రంగన్న.

రంగన్న మాటలకు కాస్త చలించింది మంజరి.

''ఈ సంపద, భోగాలు, నౌకర్లు అందివ్వలేని మరేదో ఆత్మీయత నీలో నాకు కనిపిస్తుంది. నేను ఖరీదైన బందీని. నన్ను విముక్తురాలను చేసే మహోన్నతవ్యక్తి నా ఎదర ఉన్నట్టుంది. చెరసాల జీవితానికి కూడా కొంతకాలానికి విముక్తి ఉంది. కానీ నాకటువంటి స్వేచ్ఛకూడా ఎప్పటికీ కరువే అనిపిస్తుంది. ఎందుకు నాకీ శిక్ష. ఇలా ఘరానా ఇంట్లో పుట్టడమేనా నేను చేసిన పాపం.

ఆస్తికోసం.... హోదా కోసం...

పరువు మర్యాదల కోసం... వంశగౌరవ కోసం ఆత్మని శరీరాన్ని చంపుకుంటున్నాను. అనురాగంతో అక్కున చేర్చుకొనే వారికోసం నా ఈ తపన. మగస్పర్శకోసం నా దేహ ఎదురు చూస్తోంది'' రుద్ధ కంఠంతో అంది మంజరి.

మంజరి పరిస్థితి అర్థం చేసుకున్న రంగన్న 'అంత గొప్ప ఇళ్లల్లో కూడా ఇంతటి వెలితి ఉం టుందా...?' అనుకున్నాడు.

అనురాగంతో కూడిన అభిమానం ముందు చిన్న పెద్ద, దయ క్రౌర్యం అనే బేధాలు ఉండదను కున్నాడు తిరిగి రంగన్న.

మబ్బువిడిన చందమామలా రంగన్న మంజ రిని గుండెలకు హత్తుకున్నాడు. సుఖమనేది అంత స్తుల్లో లేవు. హద్దులు తెలీని దారుల్లోనే ఉంది అను కున్నాడు రంగన్న.

'చమట ఓడుతున్న ఈ కండల్లో ఉన్న సుఖం అంతఃపురంలో హంస తూలికా తల్పంలో లేదు...' అనుకుంది మంజరి.

మంజరి శరీరం నుండి వచ్చే సువాసన, ఆమె జల తారు కురుల నుండి వచ్చే షాంపు వాసనలు, ఆమె తనువులోని లావణ్యం, బిగువైన ఆమె శరీరవంపు ల్లోని పరువం రంగన్నను మత్తెక్కిస్తోంది. ఆమెను తన బిగి కౌగిట్లో బిగించాడు. ఆమెతోపాటు మంచంపై ఒరిగిపోయాడు. ఇద్దరి మధ్య గాలి స్తంభించింది.

లోకం తనను హంతకుడు, దొంగ అని ముద్రవే సినా తనను ఓ దొరను చేసి తన్నుతాను అర్పించుకున్న మంజరి మీద ఎనలేని అనురాగం కలిగింది రంగన్నకు.

లోకం అంతా తనను పిచ్చిది అన్నా వారితో తనకు సంబంధం లేదు. ఇలాంటి అనుభూతిని కలి గించే సుఖాన్ని దూరంచేసే ఈ లోకంలో తన జీవి తంలో మధురానుభూతుల్ని అందించిన ఇతనే నాకు మహనీయుడు అనుకుంది మంజరి.

అతని చమట వాసనల్లో పురుషత్వం, అతని క్రౌర్యంలో ఆత్మ సౌందర్యం దర్శించగలిగింది మంజరి. అదే ఆమె జీవితంలో తొలిరాత్రి. 'బీడు వారిన నా జీవితానికి ఈ తొలకరి జల్లు ఈ జన్మకు చాలు' అనుకుంది.

ఎన్నోహత్యలు దోపిడీలు చేసి మానవత్వం కరువై అమానుషుడైన రంగన్నలో ఈ చర్య మాన వత్వాన్ని మేలుకొలిపింది.

అతని కథంతా పసివాడిలా ఆమెకు చెప్పుకు న్నాడు రంగన్న. మంజరి తన కథను రంగన్నతో చెప్పుకుంది. సంఘంతో పని లేనట్లు ఇలా ఒకరికి ఒకరై ఊరట పొందారు.

తెలతెల వారుతున్నట్లు కోడి కూసింది. రంగన్న యథాలాపంగా వెళ్ళిపోవడానికి సమాయత్త మయ్యాడు.

''మళ్ళీ ఎప్పుడు వస్తావ్...?'' అడిగింది మంజరి,

''బతికి బయటపడితే రేపే...'' చెప్పాడు రంగన్న.

నగలన్నీ మూటగట్టి రంగన్నకు ఇచ్చింది.

సున్నితంగా తిరస్కరించాడు రంగన్న.

''నువ్వు నాకీ రాత్రి ఇచ్చిన సుఖసంతోషాలకు ఈ లోకమంతా కొల్లగొట్టి నీకు ఇచ్చినా సరిపోదు'' అన్నాడు.

''అలా అయితే ఈ పరిసరాల నుండి అంద నంత దూరం ఎవరికీ కనిపించనంత దూరం నన్ను తీసుకెళ్లిపో..నీతో శాశ్వతంగా ఉండిపోతాను'' ఆశగా రంగన్న కళ్లల్లోకి చూస్తూ అడిగింది మంజరి.

''నేనే.. దూరం తెలీని స్థితిలో ఉన్నాను. దిన దిన గండం... క్షణక్షణం భయం... ఏ ఘడియకేమౌ తానో తెలీని బతుకు నాది. అటువంటి నేను నిన్నెలా తీసుకు పోగలను..?'' అన్నాడు రంగన్న.

''చెప్పాను కదా... ఎవరికీ కనిపించనంత దూరం అని... నా దగ్గర కావలసినంత డబ్బు నగలు ఉన్నాయి. అవి తీసుకొని మనలను ఎవ్వరూ అందుకోలేనంత దూరం పోయి హాయిగా బతు కుదాం...'' అంది మంజరి.

ఓ క్షణం తీక్షణంగా ఆలోచించాడు రంగన్న.

''ఒకటి రెండు రోజులు నన్ను నేను ఆలోచించు కోనీ మనం బయట కలసి బతికే పరిస్థితులు అను కూలించే ఘడియల్లో వస్తా. నిన్ను తీసుకుపోతా...'' చెప్పాడు రంగన్న.

''అదే ఆశతో ఎదురు చూస్తూ ఉంటాను నీకై...'' అంది మంజరి రంగన్నకు వీడ్కోలు పలుకుతూ.

***

మర్నాడు మంజరి నిద్ర నుండి ఆలస్యంగా లేచింది. మనస్సంతా దూది పింజలా ఉంది. తేలి కగా ఎగిరెగిరి పడుతోంది. ఏదో అలౌకికానందం పొందింది. ఇదివరకటి ఉద్రేకం - తాపం లేదు. మనస్సంతా ప్రశాంతంగా ఉంది. ఆ రోజు రంగన్న కోసం మొదటిసారిగా దేవుని ప్రార్థించింది. బంగారు పంజరం నుండి తనను బయటకు తీసుకెళ్లే రంగన్న కోసం మంజరి కోటి ఆశలతో, తనువంతా కళ్లు చేసుకుని ఎదురుచూస్తూ ఉంది. ☆


చిరునామా:

కొండవలస శ్రీనివాసరావు,

క్వార్టర్ నెం. 120/4, లోకో కాలనీ,

జంషెడ్‌పూర్ - 831 002.